ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 21 ఆగస్టు, 2026 | పేజీలు : 08

## నిర్దేశిత గడువులోగా ఎన్నికల సవరణ ప్రక్రియ పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అనామలిస్, నో మ్యాపింగ్ ఓటర్లుకు నోటీసుల జారీ, విచారణ అంశాలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో సర్ ప్రక్రియలో భాగంగా అనామలిస్, మ్యాపింగ్ కానీ ఓటర్లుకు నోటీసులు జారీ తదితర అంశాలపై తహసీల్దార్ లు, ఎంపిడిఓలు, బూత్ సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనామలిస్, మ్యాపింగ్ కానీ ఓటర్లుకు గ్రామ పంచాయతీల

వివరాలు 2లో

# రైతులు శాస్త్రీయ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

### భూసారిన్ని పెంపొందించే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

### కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

**ప్రజాపక్షం/జనగామ:** రైతులు శాస్త్రీయ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ రైతులకు సూచించారు. భూసారాన్ని పెంచే పంటలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రాగన్ ఫ్రూట్ సాగులో అధిక లాభాలు వస్యాయన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి నర్మెట మండలంలో విస్తృతంగా పర్యటించారు. నర్మెట మండల కేంద్రలలో పర్యటిస్తూ రైతు బిక్షపతి సాగు చేస్తున్న మిర్చి పంటను పరిశీలించారు. డ్రిప్ సౌకర్యం, మొక్కల ఎదుగుదల, పంట ఆరోగ్యం వంటి వాటిని రైతులు అడిగి తెలుసుకున్నారు. రసాయన మందులు తగ్గించి సాధ్యమైనంత వరు ప్రకృతి ఆధారిత, సహజ పద్ధతుల్లో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కూరగాయల పంటల్ని కూడా పరిశీలించారు. రైతు వెంకట్‌రెడ్డి 3 ఎకరాల్లో సాగు చేస్తున్న కంది పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. తెగుళ్ల నివారణలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలన్నారు. అనంతరం అదే మండలంలోని ఇప్పలగడ్డ తండా లో రైతుల పంటల్ని పరిశీలించారు. రైతు బండి రామలింగం మూడున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న మిర్చి, టమోటా, కాకరకాయ, కంది పంటను పరిశీలించారు. పంట దిగుబడి ద్వారా అందుతున్న సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు. పంట సాగుతో పాటు నేల స్వభావం, భూసార పరీక్షల ఫలితాలు, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్‌ను పరిగణలోకి తీసుకొని పంటల్ని ఎంపిక చేసుకోవాలన్నారు. అక్కడ మరో రైతు సాగు చేస్తున్న మిర్చి, పెసర పంటన పరిశీలించారు. కేంద్ర వంటశాలలకు స్థానిక రైతుల నుండి కూరగాయల సేకరణ పై సమీక్షించారు. పర్యటన సందర్భంగా రైతులు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని కోరగా విద్యుత్ శాఖ అధికారుతలో మాట్లాడి వెంటనే ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నర్మెట



వివరాలు 2లో

## 24న ఆటో డ్రైవర్ల బంధు




### ఎఐటియుసి ఆధ్వర్యంలో వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/జనగామ:** ఆటో డ్రైవర్లు ఈ నెల 24న చేపట్టిన నిరవధిక బంద్‌ను విజయవంతం చేయాలని ఎఐటియుసి జనగామ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ ఎఐటియుసి కార్యాలయంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి మోటే శ్రీశైలం అధ్యక్షత వహించగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటో క్యాబ్ వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్త ఆటోల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఆర్‌టిసి తరువాత అతి పెద్ద రవాణ సంస్థగా ఉన్న ఆటో రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఆటో కార్మికులు జీవనోపాధి కోసం ఆటోలు కొనుగోలు చేసి మారుమూల గ్రామానికి సైతం రవాణా సాగిస్తున్న కార్మికులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని విస్మరించిందన్నారు. అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తానని హామి ఇచ్చిన ప్రభుత్వం ఇస్తామన్న 12వేల ఆర్థిక సహాయం కూడా అందించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లకు 15వేలు ఇస్తున్నారని తెలంగాణలో ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఆర్‌టిసి యాజమాన్యానికి ఇవి ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాధన విరమించుకోవాలని, ఆటో రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా మీటర్ ఛార్జీలు పెంచాలని, ఓలా, ఊబర్, రాపిడిఓ యాప్‌లకు బందులుగా ప్రభుత్వమే కొత్త యాప్ తీసుకురావాలని, ఆటో డ్రైవర్లకు ఏడాదికి 12వేలు ఇవ్వాలని, జిఓ 263లో మిగిలిన ఆటోలను వెంటనే ఇవ్వాలని, వాహనా సారధి పోర్టల్‌లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆది సాయన్న, చామకూర యాకూబ్, చొప్పరి సోమయ్య, పుప్పాల ఐలయ్య, సుదర్శన్, గుగులోతు సఖి, చింతకింది అరుణ, యాదలక్ష్మి, జమీల తదితరులు పాల్గొన్నారు.

### మగ్రి వెంకట స్వామితో

## సిపిఐ ఉమ్మడి వరంగల్ జిల్లా సంబంధం లేదు

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** మగ్రి వెంకట స్వామి సిపిఐ వరంగల్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శిగా విలేకరుల మీడియా సమావేశంలో రావడం పార్టీ నిర్మాణపరంగా ఇది సరైనది కాదని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తెలిపారు.గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మగ్రి వెంకటస్వామి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా ఈ ప్రాంతంలో నాయకుడిగా కొనసాగాడని,కానీ గురువారం పత్రికల్లో వరంగల్,కరీంనగర్ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శిగా వార్త రావడం జరిగిందని,సిపిఐ పార్టీలో ఉమ్మడి జిల్లాల కార్యదర్శి లేరని, ఇది గమనించాలని కోరారు.గతంలో కూడా పార్టీ పేరుతో ఆయన కుల సంఘాలలో, ఇతర కార్యక్రమంలో పాల్గొంటే రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని, ఆయనకు పార్టీతో ప్రస్తుతం ఏలాంటి సంబంధం లేదని తెలిపారు. మగ్రి వెంకటస్వామి స్వగ్రామం బావుపేట ఆ గ్రామంలో ఉన్న సమస్యలపై ఏదైనా ఉంటే మండల, జిల్లా నాయకత్వానికి తెలియజేయాల్సిసిన అవసరం ఉందని,కాని వ్యక్తిగత పోకడలతో విలేకరుల సమావేశం పెట్టి మాట్లాడడం సరి అయినది కాదని తెలిపారు. ఆయన వ్యక్తిగతంగా ఏదైనా ఉంటే ఆయన పేరుతో ఇవ్వాలని,పార్టీ పరంగా కాకుండా చేసుకోవచ్చని, దానికి తాము అడ్డంకి కాదని, జిల్లాలు ఏర్పడిన నుండి హనుమకొండ జిల్లాకు ఆయనకు సంబంధం లేదన్నారు. ఈ విలేకరులసమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, కర్రే లక్ష్మ ణ్,విజయ్, గడ్డం రాజనర్సు, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం మౌలిక వసతుల కల్పనకు కృషి

### మ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**ప్రజాపక్షం/మెదక్ :** జర్నలిస్టుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకరం అందిస్తానని మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెదక్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం అధ్యక్షులు నరసింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, కోశాధికారి అశోక్



వివరాలు 2లో

## రైతులు శాస్త్రీయ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

మొదటి పేజీ తరువాయి

మండలం గుంటూరుపల్లి గ్రామంలో రైతు వెలం గన్‌రెడ్డి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తుండగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కల పెరుగుదల, పూత వచ్చే విధానం, పంట దిగుబడి, సాగు ఖర్చులు, మార్కెట్ ధర తదితర అంశాలను రైతు ద్వారా తెలుసుకున్నారు. తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న వెలంగన్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, ఇతర శాఖలు, వ్యవసాయ సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

**నిబంధనల ప్రకారమే యూరియా**

రైతులకు నిబంధనల ప్రకారమే యూరియా, ఎరువులు విక్రయించాలని కలెక్టర్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. గురువారం నర్మెట మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రాన్ని క్షుణంగా పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలు పరిశీలించారు. ఎరువుల స్టాక్ వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ఎన్ని మిల్లుల నుండి బియ్యం వస్తున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## నిర్దేశిత గడువులోగా ఎన్నికల సవరణ ప్రక్రియ పూర్తి

మొదటి పేజీ తరువాయి

వారీగా విడతలవారీ నోటీసులను జారీ చేయాలని సూచించారు. నోటీసు అందజేసిన అనంతరం నిబంధనల ప్రకారం ఏడు రోజుల వ్యవధి ఇచ్చి విచారణ చేపట్టి, ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. నోటీసు తీసుకున్న వ్యక్తుల ఫోటో అప్ లోడ్ చేయాలని సూచించారు. ఎంపీడీఓలు, ఏఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పరస్పర సమన్వయంతో మండలాల వారీగా పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. రాబోయే 30 రోజుల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో నో మ్యాపింగ్, వ్యత్యాసాలకు సంబంధించిన ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నదని, సమయాన్ని సద్వినియోగం చేసుకొని అంశాన్ని సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, బూతు స్థాయి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం మౌలిక వసతుల కల్పనకు కృషి

మొదటి పేజీ తరువాయి

ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ బాధ్యులు, జర్నలిస్టులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ భవనం పై అంతస్తు నిర్మాణం, జర్నలిస్టు కాలనీలో తాగునీటి సౌకర్యం, ఇంటి స్థలాల కేటాయింపు, కాలనీ అభివృద్ధి తదితర సమస్యలను అధ్యక్షుడు నరసింహాచారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రోహిత్ రావు, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు ఐక్యంగా పని చేసి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు ఉన్నారు.

## ఎన్‌సిడిసి కార్యక్రమాల అమలుపై సమీక్ష



**ప్రజాపక్షం/నర్సంపేట:** ఎన్‌సిడిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజారోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించేందుకు సెంట్రల్ ప్రాజెక్ట్ హెల్త్ మేనేజర్ డాక్టర్ సామ్, రాష్ట్ర ప్రజారోగ్య పరిశీలన టీమ్ (స్పాట్) సభ్యులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి రాజారెడ్డి ని కలిసి జిల్లాలో అమలవుతున్న ఐడిఎస్‌పి (సమగ్ర వ్యాధుల సర్వే లెన్స్ ప్రోగ్రాం) పరిధిలోని తొమ్మిది ఆరోగ్య విభాగాల కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, నివేదికలపై చర్చించారు. అనంతరం డాక్టర్ సామ్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నర్సంపేటను సందర్శించి ఎన్ సి డి సి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో సంబంధిత రికార్డులు, వ్యాధి నిఘా వ్యవస్థ, కార్యక్రమాల అమలు మరియు సిబ్బంది సమన్వయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, డేటా నివేదికలు వ్యాధులపై నిరంతర నిఘా తదితర అంశాలపై సంబంధిత సిబ్బందితో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణకు వ్యాధి నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దామోదర, స్థానిక ఆసుపత్రి డాక్టర్లు, ఐడిఎస్‌పి ప్రోగ్రాం అధికారి డాక్టర్ అరుణ్ జోషి, ఎపిడమియాలోజిస్ట్ డాక్టర్ అఖిల్, డిపిఓ అర్చన, డిడిఎం సంజీవ్, సంబంధిత వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దారుఢ్యాన్ని పెంపొందించంతో పాటు మానసిక ఉల్లాసాన్ని క్రమశిక్షణ పెంచుతాయని బల్దియా కమిషనర్ టి వెంకన్న అన్నారు. స్పోర్ట్స్ కౌన్సిల్, ఓఎంసి సర్కిల్, తెలంగాణ ట్రాన్స్‌కో డిస్కం, వరంగల్ ఆధ్వర్యంలో బల్దియా ఇండోర్ స్టేడియంలో ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్(పురుషులు, మహిళలు), ఫుట్‌బాల్(పురుషులు) టోర్నమెంట్ 2026...27 ముగింపు కార్యక్రమానికి గురువారం కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు, ట్రోఫీలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు , ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు దోహదపడతాయని, క్రీడల్లో పాల్గొనడం ద్వారా టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, క్రమశిక్షణ వంటి ఉత్తమ లక్షణాలు అలవడతాయని అన్నారు. గెలుపు కంటే క్రీడా స్ఫూర్తితో పోటీలో పాల్గొనడం ముఖ్యమని, గెలుపోటములను సమానంగా స్వీకరించి మరింత పట్టుదలతో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. ప్రజలకు అత్యవసర వేళలో 24/7 సేవలు అందించడానికి బల్దియా, ట్రాన్స్‌కో విభాగాలు ముందజలో ఉంటాయని, సిబ్బందికి ఇలాంటి క్రీడలు ఎంతో ఉపయుక్తమని, ఒక క్యాలెండర్ ఇయర్‌లో పకడ్బందీగా పోటీలను నిర్వహించడం ప్రశంసనీయమని, ఇట్టి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, పాల్గొన్న క్రీడాకారులను ఈ సందర్భంగా కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ మురళి సాగర్, ఎన్‌పిడిసిఎల్ జిఎం హేమంత్ కుమార్, రవీంద్ర, ఉద్యోగులు, పాల్గొన్నారు.

## భిక్షపతి కుటుంబానికి పెయింటర్స్ యూనియన్ ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/నెక్కొండ:** అనారోగ్యంతో మృతి చెందిన పెయింటర్ ఈదునూరి భిక్షపతి కుటుంబానికి ఏఐటి యూసి అనుబంధ రెయిన్‌బో పెయింటర్స్ యూనియన్ అండగా నిలిచింది. నెక్కొండ మండల కేంద్రంలోని నందమూరి నగర్ కాలనీకి చెందిన భిక్షపతి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి యూనియన్ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. రెయిన్‌బో పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు సింగం ప్రశాంత్ ఆధ్వర్యంలో భిక్షపతి సతీమణి మరియా కుమారుడు నవీన్‌కు 25 కిలోల బియ్యంతో పాటు రూ.6వేల నగదును అందించారు. ఈ సందర్భంగా కుటుంబానికి యూనియన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని నాయకులు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు లైశెట్టి వినయ్, కందిక శ్రీనివాస్, ఈదునూరి అనిల్, ఉపాధ్యక్షుడు పోలేబోయిన రమేష్, సభ్యులు దంతాల శ్యాం, ఈదునూరి వినయ్, దంతాల యాకయ్య, కందిక అశోక్, కందిక రాజు, తాటికాయల యాకయ్య, సింగం వంశీ, మాతంగి ప్రశాంత్, ఆకులపెల్లి నరేష్, మంకాల కిషన్, కొంగర రవి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట




**ప్రజాపక్షం/గణపురం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ అన్నారు. గణపురం మోడల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు యూనిఫాంలు, పాఠశాల బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యా సామాగ్రి అందిస్తూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గుర్రం వసంత, ప్రిన్సిపాల్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** ముల్కనూర్ బస్టాండ్ అంబేద్కర్ కూడలిలో ఏర్పాటుచేసిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచం పల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి నివాళులర్పించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయాలు మనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### హసన్‌పర్తిలో

**ప్రజాపక్షం/హసన్ పర్తి:** భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ భారతదేశ ఐటి విప్లవ పితామహుడు అని 65వడివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్ తెలిపారు. గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామం బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 65వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేదునూరి సునీల్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీచిత్రపటానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరంఆయనమాట్లాడుతూ 40 సంవత్సరాల వయసులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ టెలికాం ఐటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వివరించారు. భారతదేశ ఒక బలమైన ఆధునిక దేశంగా ఎదగాలి అనేది ఆయన కల దేశ సమైక్యత సాంకేతిక అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అయ్యాల రాంరెడ్డి ఎర్ర ప్రకాష్, భాష బోయిన కుమారస్వామి, నేదునూరి శ్రీనివాస్, పాల్గొన్నారు.

### నడికూడలో

**ప్రజాపక్షం/నడికూడ :** సాంకేతిక విప్లవం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేసిన భారత్ రత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి ని సద్భావనా దివస్ గా నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.డిసిసి,పరకాల ఎమ్మెల్యే రేవూరి ఆదేశాల మేరకు,నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్నెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు, నవ భారత్ నిర్మాణంలో తనదైన ముద్ర వేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఆయన అడుగుజాడల్లో మనమందరం నడవాలి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర దేవేందర్ గౌడ్,జిల్లా కార్యదర్శి మోహన్ రావు,నడికూడ సర్పంచ్ కుడ్ల మాలహాల్ రావు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కొడకండ్లలో

**ప్రజాపక్షం/కొడకండ్ల:** రానున్న భవిష్యత్ తరాలకు భారత దేశ దశ దిశలను మార్చిన, భారత యువతకు ఎంతో ఆదర్శ ప్రాయుడు మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ ఆదర్శమని కొడకండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ సురేష్ కుమార్ నాయక్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో రాజీవ్ జయంతి సందర్భంగా ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ విషయంలో ఉపాధికార అభివృద్ధి, దేశ భవిష్యత్‌ను ప్రపంచ దేశాలలో అగ్రగామిగా ఉంచేందుకు కర్తవ్య నిర్వహణతో రాజీవ్ అహర్నిశలు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సునీల్ రెడ్డి, మధుసూదన్, సుగుణమ్మ, అనిత, యుగంధర్ రెడ్డి, సుజాత, మమత, సతీష్, నాగరాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ (బాలికల) పాఠశాలను గురువారం స్థానిక 29వ వార్డు కౌన్సిలర్ వేముల సంధ్యాసాంబయ్యగౌడ్ సందర్శించారు. పాఠశాల కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అసంపూర్ణంగా ఉన్న గర్ల్స్ టాయిలెట్స్‌ని భోజనశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి,అనంతరం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ వేముల సాంబయ్య గౌడ్, డిసిసి మెంబర్ దండెం రతన్ కుమార్, ఎన్‌ఎస్‌ఐ అధ్యక్షులు కటారి ఉత్తమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# దేవరుప్పలకు ఎస్ఆర్ఎస్‌పి నీరు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న దేవరుప్పుల మండల రైతులకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయించిన పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వమే కాలువలు తీసి రైతులకు సాగునీరు అందిస్తోందన్నారు. స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ నుండి ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీరు మండలానికి చేరడంతో కాంగ్రెస్ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాలువ వద్ద నీటి పూజ నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి నీటికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్లక్ పల్లి ట్రాక్టర్స్ యూనియన్ అధ్యక్షులుగా బైరపాక ఏలియా

**ప్రజాపక్షం/ధర్మసాగర్:** ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి ట్రాక్టర్స్ యూనియన్ అధ్యక్షులుగా బైరపాక ఏలియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలియా ప్రస్తుతం మల్లక్ పల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉంటూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కు పాడినారు. తనపై నమ్మకం తో తిరిగి ట్రాక్టర్స్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్నిక చేసి నందుకు సభ్యులకు రుణపడి ఉంటాను అని, సంఘాన్ని అన్ని విధాలుగా ముందు వారసలో నిలుపు తానని ఆర్థికంగా ముందు వరసలో నిలపాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఇందుకోసం తన వంతు ప్రయత్నం చేస్తానని, రైతులకు సరియైన న్యాయం చేకూర్చే విధంగా అందరం పనిచేయాలని ఏలియా అన్నారు.

# బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలో ఇటీవల మృతిచెందిన, ప్రమాదవశాత్తు గాయపడిన బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. గురువారం మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రాపోలు లక్ష్మ ణ్ జీడి సత్యనారాయణ, సోమయ్య, ఎల్లమ్మ గడ్డ తండాకు చెందిన నందియా, మల్లంపెల్లికి చెందిన మోహన్, కంబాలకుంట తండాకు చెందిన చందర్ ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి చిత్రపటాలకు పూల మాలలు వేసినివాళులు అర్పించారు. వారి వెంట సర్పంచ్‌లు వెంకన్న, విజయ, నాగన్న, మహేందర్ నాయక్, గాంధీ నాయక్, పాల్గొన్నారు.

# సిద్దేశ్వర స్వామి ఆలయ హుండీకి రూ.5.11 లక్షల ఆదాయం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని కొడవటూర్ స్వయంభు శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ హుండీ ద్వారా రూ.5.11 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో చిందం వంశి తెలిపారు. మార్చి 2026 నుండి ఆగష్టు వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను గురువారం ఆలయ మండపంలో లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్గొండ ఏసీ, అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ రావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, ఆలయ చైర్మన్ వెంకరెడ్డి, నరసింహులు, రాజయ్య, ఉమాపతి, మల్లేశం, అర్చకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఘనంగా 2026 ఆర్థోపెడిక్ సర్జన్స్ సదస్సు



**ప్రజాపక్షం/హనుమకొండ:** తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (టిఓఎస్ఏ) ఆధ్వర్యంలో వరంగల్ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (డబ్ల్యుఓఎస్ఏ) సహకారంతో ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా స్టేట్స్ – టిఓఎస్ఏ– 2026 నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిఓఎస్ఏ – ఓయాసిస్కాన్ 2026 ఆర్థోపెడిక్ సదస్సు వివరాలను నిర్వాహకులు వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 21న సాయంత్రం 5:30 గంటలకు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో టిఓఎస్ఏ – ఓయాసిస్కాన్ 2026 సదస్సు ప్రారంభం కానుందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,000 మంది ఆర్థోపెడిక్ వైద్యులు ఈ ప్రతిష్టాత్మక సదస్సులో పాల్గొంటున్నారని చెప్పారు.సదస్సులో సుమారు 295 మంది ప్రముఖ స్పీకర్లు పాల్గొని ఆధునిక ఆర్థోపెడిక్ వైద్యంలో వస్తున్న నూతన సాంకేతికతలు, చికిత్సా విధానాలు, తమ అనుభవాలను వైద్యులతో పంచుకోనున్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఓయాసిస్ సెక్రటరీ జనరల్ డాక్టర్ కె. రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ఓయాసిస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారని తెలిపారు.ముఖ్యంగా ఆర్థ్రోప్లాస్టీ, రోబోటిక్ కేఎన్ఈఈ రీప్లేస్‌మెంట్, క్లిష్టమైన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు, హ్యాండ్ సర్జరీ, మైక్రో సర్జరీ వంటి అధునాతన వైద్య అంశాలపై నిపుణుల చర్చలు, ప్రదర్శనలు, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఒకరోజు సిఎంఈ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ పి. సుధీర్ కుమార్, ప్రముఖ సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ వద్దిరాజు రాకేష్, ఉత్తమ్ వైద్య గట్టు తదితరులు పాల్గొన్నారు.

# చర్మం కోత లేకుండా హార్ట్ సర్జరీ చికిత్స

**ప్రజాపక్షం/ హనుమకొండ :**యశోద హాస్పిటల్‌లోని ఇంటర్వెన్షన్ రేడియాలజీ విభాగంలో మినిమల్లీ ఇన్వాసివ్ చికిత్సల కోసం అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నాయని యశోద ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఇంటర్వెన్షన్ రేడియాలజీ అనేది ఆధునిక వైద్యంలో ఒక ప్రత్యేక విభాగం అని, ఇది వివిధ ఆరోగ్య సమస్యలకు, ముఖ్యంగా రక్తనాళాలకు సంబంధించిన సమస్యలకు, శరీరంలో అతి తక్కువ కోతతో చేసే విధానాలతో వ్యవహరిస్తుందని తెలిపారు.ఇది చర్మాన్ని కోయకుండా,ఓపెన్ సర్జరీ లేకుండా వ్యాధులకు చికిత్స చేయడానికి ఎక్స్‌రేలు, యాంజియోగ్రఫీ, సీట్ స్కాన్, ఎంఆర్ఐ మొదలైన రేడియాలజికల్ ఇమేజింగ్ పద్ధతులను ఉపయోగిస్తుందని,ఈ చికిత్సలు శరీరంపై ఎలాంటి పెద్ద కోత లేదా మచ్చ లేకుండా, ఒక చిన్న సూది రంధ్రంతో చేస్తారని, మెదడులోని రక్తనాళాలు అడ్డుపడటం వల్ల ఒక వ్యక్తికి బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చు, దీనివల్ల పక్షవాతం, మాట కోల్పోవడం లేదా కోమా కూడా సంభవించవచ్చని తెలిపారు.మెదడులోని రక్తనాళాలలో ఏర్పడిన ఈ అడ్డంకులను మెకానికల్ థ్రాంబెక్టమీ అనే మినిమల్లీ ఇన్వాసివ్ ఇంటర్వెన్షన్ రేడియాలజీ విధానం ద్వారా, కొన్నిసార్లు యాంజియోప్లాస్టీ, బ్రెయిన్ రక్తనాళాలకు స్టెంటింగ్ ద్వారా తెరవవచ్చునని, అదేవిధంగా కొన్నిసార్లు మెదడులోని రక్తనాళాలు ఉబ్బి, దానిని అన్యూరిజం అని పిలుస్తారని,ఇది పగిలిపోయి మెదడులో ప్రాణాంతక రక్తస్రావానికి కారణం కావచ్చు అన్నారు.డాక్టర్ మనీషా జోషి మాట్లాడుతూ ఆధునిక వైద్యంలో ఊపిరితిత్తులు, పొత్తికడుపు, కాళ్ళ వంటి శరీరంలోని ఇతర భాగాలలో ఇలాంటి రక్తస్రావం, రక్తనాళాల అడ్డంకులకు కూడా ఈ విధానాలతో చికిత్స చేస్తున్నారని అన్నారు. యశోద ఆసుపత్రిలో సంక్లిష్టమైన వ్యాధులకు అధునాతన పద్ధతులతో చికిత్స అందించడానికి బైప్లేన్ క్యాత్ ల్యాబ్ వంటి అత్యాధునిక యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# సింగరేణి కార్మికుడు గోపి కుటుంబాన్ని ఆదుకోవాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని కెటికె1 ఇంక్లైన్ మైన్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు గోపాల గోపి మైన్‌లో ఊపిరాడక మృతి చెందడంతో విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సింగరేణి ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోపి కుటుంబ సభ్యులతో,ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపారు. అనంతరం సింగరేణి అధికారులతో మాట్లాడి కార్మికుల సమస్యలను, వారి డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మైన్‌లో ప్రమాదం జరిగినా, ఇతర కారణాలతో కార్మికులకు ఏదైనా అనారోగ్య సమస్య లేదా ప్రమాదం ఎదురైనా వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక అంబులెన్స్, ఒక డాక్టర్, ఇద్దరు టెక్నీషియన్లను అందుబాటులో ఉంచాలని సింగరేణి అధికారులను డిమాండ్ చేశారు. కుటుంబంలోని ఒకరికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం గోపి పార్థివ దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** భారతదేశ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో హన్మకొండలోని డీసీసీ కార్యాలయం, ఎంజీఎం సెంటర్ లలో ఈ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా డీసీసీ భవన్‌లో ఆయన చిత్రపటానికి, ఎంజీఎం సెంటర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయ్యూబ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు, టీపీసీసి మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, వరంగల్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సాగరిక రావు , చైర్మన్లు అజీజ్ ఖాన్, టీపీసీసి జనరల్ సెక్రేటరీ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అనుబంధ సంఘాల చైర్మన్లు తదితరులు కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. 21వ శతాబ్దపు ఆధునిక భారతదేశ నిర్మాణానికి, దేశంలో నేడు మనం చూస్తున్న ఐటీ, టెలికాం, కంప్యూటర్ విప్లవానికి రాజీవ్ గాంధీనే అని బీజం వేశారని కొనియాడారు. కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారు పిలుపునిచ్చారు.

# నిరుపేద మహిళకు రూ.2.5 లక్షల సిఎంఆర్ఎఫ్ ఎల్‌వోసి అందజేత

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద రజక కుటుంబానికి చెందిన మామిడాల స్వప్న గాల్‌బ్లాడర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 2.5లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. డీసీసీ ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుని ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ చౌడ్ చొరవతో మంత్రి పొన్నం ప్రభాకర్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి దృష్టికి విషయం తీసుకెళ్లా నిధులు మంజూరయ్యాయి. అనంతరం కిరణ్ కుమార్ గౌడ్ ఆసుపత్రిలో స్వప్నకు మంజూరు పత్రాన్ని అందజేశారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శ్రావణ్‌కు ఉత్తమ బహుమతి

**ప్రజాపక్షం/వెంకటాపూర్:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం—2026 సందర్భంగా నిర్వహించిన ఖమ్మం ఫోటోగ్రఫీ పోటీలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట చెందిన ఫోటోగ్రాఫర్ తడండ్ల శ్రావణ్ ఉత్తమ నగదు బహుమతిని అదనపు డీసీపీ బొజ్జా రామానుజన్ చేతుల మీదుగా అందుకున్నారు..ఖమ్మం ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీ నిర్వహించారు. శ్రావణ్ సమర్పించిన 'జియో ఆఫ్ సింపుల్ సిటీ ' ఫోటోకు ఈ బహుమతి లభించింది.ప్రకృతి, గ్రామీణ జీవనం, సంస్కృతి, సంప్రదాయాలను తన కెమెరాలో అందంగా ఆవిష్కరిస్తున్న శ్రావణ్‌కు ఈ అవార్డు రావడం పట్ల ఫోటోగ్రఫీ రంగానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు. ఈ గుర్తింపు తనలో మరింత స్ఫూర్తిని నింపిందని శ్రావణ్ తెలిపారు.

# జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో వనమహోత్సవం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం... అనే లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని విద్యార్థుకు విద్యతో పాటు పర్యావరణం మీద అవగాహన కల్పించాలని కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతచార్యులు గడ్డం భాస్కర్ అన్నారు. ఈ మేరకు గురువారం వరంగల్ హంటర్రోడ్లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో వనమహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా పీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతచార్యులు గడ్డం భాస్కర్ , ప్రముఖ పర్యావరణ వేత్త తాళ్లపల్లి రామస్వామి గౌడ్ పాల్గొని పీఠానికి పలు రకాల పండ్లు, పూల మొక్కలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పరిసరాలలో మొక్కలు నాటడం వల్ల పర్యావరణం కాపాడుకోవడమే కాక భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందించినట్లేనని అన్నారు. ఈ సందర్భంగా పీఠం పరిసరాలలో విద్యార్థులు, పీఠం సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అమేర్ ఆలీఖాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా నతీష్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్,ఎంఎస్‌పి మండల కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/వేలేరు :** ఎంఆర్‌పిఎస్,ఎంఎస్‌పి మండల కమిటీని గురువారం వేలేరు మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని మనీఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశానికి హనుమకొండ జిల్లా ఇంచార్జ్ ఏపూరి వెంకటేశ్వర్‌రావుమాదిగ ముఖ్యఅతిధిగా హాజరై నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది ఎంఆర్‌పిస్ వేలేరు మండలఅధ్యక్షుడుగా మ్యాక సృజన్,అధికారప్రతినిధిగా ఆకునూరి ప్రశాంత్,ప్రధానకార్యదర్శిగా అక్కల గణేష్,మిడిదొడ్డి అర్జున్,పఅధ్యక్షులుగా మ్యాక రవితేజ,హనుమకొండ గిరిప్రసాద్,ఎన్నిక కగా ఎంఎస్‌పి నుండి అధ్యక్షులు రామంచ యేసు,అధికారప్రతినిధి అక్కల శంకర్,ప్రధానకార్యదర్శి మిడిదొడ్డి సారయ్య,కొయ్యడ శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జోగు మల్లయ్య,ఆకునూరి రాజయ్య,కార్యదర్శి మోతె కనుకయ్య,ఎల ఉపెందర్,జోగు సారయ్యుప్పలయ్య తదితరులను ఎన్నకున్నారు.ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ మహానీయుల కళలు సాకారం కావలంటే భవిష్యత్ ఉద్యమానికి యువత నడుంబింగించాలని అన్నారు.కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు హనుమకొండ మనోజ్,బట్టు ధర్మేందర్,రామంచ సుధాకర్,కనుకరాజు,ఐలయ్య,వెంకటయ్య తదితరలు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న పాలకులు

**ప్రజాపక్షం/వరంగల్:** నిరుద్యోగ యువతను ఉద్యోగాల పేరుతో గత పాలకులు, నేటి పాలకులు మోసం చేస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్మారపు సాంబమూర్తి అన్నారు. వరంగల్ జిల్లా శివనగర్ తమ్మెర భవన్‌లో ఏఐవైఎఫ్(అఖిల భారత యువజన సమాఖ్య )వరంగల్ జిల్లా నాలుగో మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మారపు సాంబమూర్తి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులుగా మస్కా సుధీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నికచేశారు. మొత్తం 21 మంది సభ్యులతో కూడిన నూతన జిల్లా కమిటీని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వలివుల్లా ఖాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు దండు లక్ష్మణ్‌లు ప్రకటించారు. దేశంలో బిజెపి పాలక పార్టీ నిరుద్యోగ యువతను మోసం చేసే విధంగా 2014 ముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిందని, ఉద్యోగాలకు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగించే విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని, తద్వారా ఉన్న ఉద్యోగా ఉపాధి కోల్పోయి యువత నిరుద్యోగిగానే మిగిలి పోతున్నారని వాపోయారు.ఈ మహాసభలో నవీన్, జగదీష్, సహాయ కార్యదర్శులుగా ఎండి యాకూబ్, ఎండి అబ్బు, కోశాధికారిగా గణేష్, కార్యవర్గ సభ్యులుగా, కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ విజయవంతం కావడానికి సహకరించిన సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మేకల రవి, ధన్యవాదాలు తెలిపారు.

## గోపాల గోపి మృతి సిపిఐ, ఎఐటియుసికి తీరని లోటు

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భూపాలపల్లి ఏరియాలోని కేటీకే వన్ గనిలో పనిచేస్తున్న సింగరేణి కార్మికుడు గోపాల గోపి అకాల మరణం సిపిఐ ఏఐటియుసికి తీరని లోటని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ అన్నారు. భూపాలపల్లి కేటికే 1వ గనిలో పని చేస్తూ బుధవారం అర్ధరాత్రి 1:00 గంటల సమయంలో మైన్‌లో విధులు నిర్వహిస్తుండగా గోపాల గోపి గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. గోపి పార్థివదేహానికి ఎర్రజెండా కప్పి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి జోహార్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, గోపాల గోపి అకాల మరణం సీపీఐ పార్టీకి, ఏఐటీయూసీకి, సింగరేణి కార్మిక లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. సిపిఐ శాఖ కార్యదర్శిగా, సింగరేణి ఏఐటీయూసీ నాయకులుగా అనేక కార్యక్రమాలు ముందుండి నడిపి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయూసీ బ్రాంచి, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మండలకేంద్రంలోని శ్రీపాద కేడలి వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాఈవ్ గాంధి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కట్కం అశోక్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆధునిక సాంకేతికతను దేశానికి పరిచయం చేసారని దూరదృష్టి కలిగిన నాయకుడిగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, వెన్నపురెడ్డి రాజశేఖర్, అటకాపురం స్వామి, మదిర రమేష్, అన్నారం వార్డు సభ్యుడు సెగ్గెం శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

## ఇండ్లను వెంటనే పేదలకు కేటాయించాలి



**ప్రజాపక్షం/కమలాపూర్:** తెలంగాణ తొలి సిఎం కేసీఆర్ హయంలో కమలాపూర్ మండల కేంద్రంలో సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో 394 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను నిర్మించారని, ఒక్కో ఫ్లాట్ కు రూ. 5.04 లక్షలు ఖర్చు చేశారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. అదనంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీటి వంటి మౌళిక వసతుల కోసం రూ. 4.92 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. కమలాపూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... ఇటీవల కమలాపూర్ కు వచ్చిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ వారం రోజుల్లో లబ్ధిదారుల పేర్లు ప్రకటించి ప్రోసిడింగ్స్ ఇస్తామని చెప్పి పది రోజులు గడిచినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. గృహ సముదాయాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, తలుపులు, అద్దాలు సరిగా లేని పరిస్థితుల్లో ప్రజలను ఇళ్ళలోకి ఎలా పంపుతారని ప్రశ్నించారు. గూడూరు, మర్రిపల్లిగూడెంలలోను ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇళ్ళ కేటాయింపులో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, ఆడియోలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్ళు కేటాయించాలని, ఎన్నికల హామీలైన పెన్షన్ల పెంపు, మహిళా సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ పోల్నేని సత్యనారాయణ రావు, పిఏసిఎస్ చైర్మన్ సంపత్ రావు, సీనియర్ నాయకులు తక్కళ్ళపల్లి సత్యనారాయణ రావు, ఇంద్రసేనా రెడ్డి, మాజీ జడ్‌పిటిసిలు నవీన్, లక్ష్మణ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజేష్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో బిఎల్ఎలు బాధ్యతయుతంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఎస్ఐ ఆర్ ప్రక్రియలో బిఎల్ఏ ల పాత్ర అత్యంత కీలకమని,ప్రజల ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ ఇన్చార్జ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు లు సూచించారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో సర్ ప్రక్రియ ఫేజ్2లో భాగంగా బిఎల్ఎల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వారు మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు బి ఎల్ ఏ లుబాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఓటరు జాబితాలో ఉన్న ఆబ్సెంట్, (మరణించిన వారు), (డూప్లికేట్) వంటి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సరైన ఆధారాలతో సంబంధిత వివరాలను సరిచేసే విధానంపై బి ఎల్ ఎ లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నాజర్, టిపిసిసి కోఆర్డినేటర్ సిరాజ్ హుస్సేన్, దొడ్డి కిష్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకీ యాదవ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ




**ప్రజాపక్షం/మల్హార్:**వార్షిక తనిఖీల్లో భాగంగా కొయ్యూరు పోలీస్ స్టేషన్, కార్యాలయాన్ని తనిఖీ చేసిన కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా కాళేశ్వరం జోన్ డీఐజీ శ్రీ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్ గురువారం భూపాలపల్లి జిల్లాలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్ కార్యాలయాన్ని సమగ్రంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్,ఐపీఎస్ డీఐజీ గారికి ఘన స్వాగతం పలికారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్,సర్కిల్ కార్యాలయాల పరిశుభ్రత,రికార్డుల నిర్వహణ,మాల్ఖానా, ఆయుధాగారం,వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది టర్న్అవుట్, క్రమశిక్షణ,యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను డీఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ అధికారులు, సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి విధి నిర్వహణ,పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. మహిళలు, చిన్నారులు,వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించే విధంగా సేవలందించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొయ్యూరు పోలీస్ స్టేషన్,లో డీఐజీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావు, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు,కొయ్యూర్ ఎస్ ఐ మహేందర్ కుమార్,పోలీస్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫర్ బోర్డు ఏర్పాటుచేసి. సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహశిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు యూనియన్ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా నాయకులు పాండ్యాల అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా వేలాది మంది హమాలీ కార్మికులు మార్కెట్లు, గోదాంలు, రైస్ మిల్లులు, కూరగాయల మార్కెట్లు తదితర రంగాలలో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే హమాలీ కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసి, పెన్షన్, ప్రమాద భీమా, ఆరోగ్య సదుపాయాలు, పిల్లలకు విద్య, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం, తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు బుచ్చయ్య, నరసయ్య, మోహన్, కిట్టయ్య, రాజు, అచ్చింతల రాజు, సంపత్, మహేందర్, రవి, మల్లేశం, ఉప్పలయ్య, కుమార్, గట్టయ్య, రాజు, నరసయ్య,పాల్గొన్నారు.

## చిన్న కాలేశ్వరం ప్రాజెక్టు భూసేకరణను త్వరిత గతిన పూర్తి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ, ఇరిగేషన్, మెగా కంపెనీ అధికారులతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ, కాలువల నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు పనుల్లో జాప్యం లేకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో వేగవంతం చేయాలని సూచించారు. భూ సేకరణకు సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ సేకరణకు అవసరమైన భూముల సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, సర్వేకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు అందచేయాలని ఆదేశించారు. కాలువల నిర్మాణ పనులతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను శాఖల మధ్య సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా రెవెన్యూ, ఇరిగేషన్, సంబంధిత సంస్థల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. పనుల పురోగతిపై నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం ఆర్డీఓ రవీందర్, తహసీల్దార్లు, ఇరిగేషన్ ఇంజినీర్లు, మెగా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆలయంలో నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని ఆది ముక్తీశ్వర ఆలయం వద్ద బాలాలయంలో నేడు శ్రావణ రెండో శుక్రవారం సంధర్భంగా ఉదయం పది గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.ఈ సంధర్భంగా భక్తులు,స్థానిక మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో యువకునికి తీవ్రగాయాలు

**ప్రజాపక్షం/కాటారం:** విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని సుబ్బయ్యపల్లిలో గురువారం చోటు చేసుకుంది వివరాలిలా ఉన్నాయి సుబ్బయ్య పల్లి సమీపంలోని రైస్‌మిల్ వద్ద ఇంటర్నెట్‌పనులు నిర్వహిస్తుండగా మాదారం గ్రామానికి చెందిన సింగినేని స్వామి ప్రమాదవశాత్తు 11 కేవి విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు.వైర్లు సర్దుతున్న సమయంలో విద్యుత్ షక్‌కు గురైన స్వామి అక్కడికక్కడే తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వెంటనే కాటారం ప్రాథమిక ఆరగ్య కేంద్రానికి తరలించారు.పరిస్థితి విషమించడంతో మురుగైనసేవల కోసం వెంటనే 108 భూపాలపల్లి వందపడకలకు తరలించారు.విద్యుత్ షాక్ కు గురైన కారణంగా నుడుము భాగం నుండి కాళ్ల వరకు రక్త ప్రసరణసక్రమంగా లేదని వైద్యులు తెలిపారు.నిరుపేద కుటుంబానికి ఎందిన స్వామికి ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు స్థానికులు కోరుతున్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతం చేయాలి

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతను బలోపేతం చేయాలని కాళేశ్వరం జోన్ డిజిపి అంబర్ కిశోర్ ఝా అన్నారు.గురువారం జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలకేంద్రంలోని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయాన్ని సమగ్రంగా తనిఖీ చేసారు.వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవపూర్ చేరుకున్న డిఐజి అంబర్ కిశోర్ ఝా కు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పోలీస్టేసన్ సర్కిల్ కార్యాలయాల పరిశుభ్రత రికార్డుల నిర్వహణ, మల్ఖానా, ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది టర్నౌట్, క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాటారం డిఎస్పీ సూర్యనారాయణ,మహాదేవపూర్,కాటారం సిఐలు వెంకటేశ్వర్లు నాగార్జున రావు,మహాదేవపూర్,కాళేశ్వరం,పలిమెల ఎస్సైలు,సాంబమూర్తి,రమేష్,శశాంక్,తమాశా రెడ్డి,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సిగ్నల్ సమస్య

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండల కేంద్రమైన అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో సిగ్నల్ సమస్యతో సతమతమవుతున్న అధికారులు అర్జీదారులు. 'ప్రజాపక్షం' ప్రతినిధితో తహసీల్దార్ మాట్లాడుతూ కార్యాలయంలో సిగ్నల్ సమస్యతో ప్రజా సమస్యలు తొందరగా పరిష్కారం కావడం లేదన్నారు. ప్రజలు దీన్ని దృష్టిలో ఉంచుకొని సమన్వయం పాటించాలని తెలిపారు. సిగ్నల్ కు సంబంధించిన అధికారులు చర్యలు చేపట్టి సమస్య వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరారు.

## జపాన్ పర్యటనకు ఎన్ఓసి

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మండల పరిధిలోని రామాయపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మచ్చ రజిత జపాన్ పర్యటనకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పర్యటనకు వెళ్లేందుకు అవసరమైన ఎన్ఓసీని జిల్లా విద్యాధికారి రాజు గురువారం ఆమెకు అందజేశారు.జపాన్‌లోని విద్యా విధానం, అక్కడ అమలవుతున్న బోధనా పద్ధతులపై అధ్యయనం చేసేందుకు ఎంపికైన ఉపాధ్యాయుల బృందంలో రజితకు అవకాశం లభించింది. ఈ సందర్భంగా డిఇఒ రాజు ఆమెను అభినందించి,జపాన్ పర్యటనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జపాన్‌లో విద్యా రంగంలో అమలవుతున్న నూతన విధానాలను పరిశీలించి, వాటిని మన విద్యా వ్యవస్థలో అన్వయించేందుకు కృషి చేయాలని కోరారు. తనను జపాన్ పర్యటనకు ఎంపిక చేసినందుకు రజిత కృతజ్ఞతలు తెలిపారు.

## విరాహత్ అలీని పరామర్శించిన విమలక్క



**ప్రజాపక్షం/గజ్వేల్:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క గురువారం గజ్వేల్ పట్టణంలోని విరహత్ అలీ ఇంటికి చేరుకొని విరహత్ అలీతో పాటు కుటుంబ సభ్యులు విరాసత్, విజారత్‌లను పరామర్శించారు. బాషారత్ ఉన్నిసా బేగం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

## రాజీవ్ సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/కొండపాక:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని కుకునూరుపల్లి మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి రాజీవ్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాల సాధనకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అటవీ శాఖ నూతన ఫీల్డ్ వాహనం ప్రారంభం

### ప్రారంభించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా అటవీ శాఖకు ప్రభుత్వం నూతనంగా అందించిన ఫీల్డ్ వెహికిల్‌ను ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు క్షేత్రస్థాయిలో అధికారులు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు ఈ వాహనం ఎంతోగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో పర్యవేక్షణ, అక్రమ రవాణా నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చర్యలను వేగవంతం చేసేందుకు వాహనం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ మెదక్ ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

### యాప్‌ల పేరుతో ఎరువులు అందకుండా చేస్తున్నారంటూ ఆగ్రహం



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** యూరియా కోసం మనోహరాబాద్ మండలంలోని పలు గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు.పంటలకు అవసరమైన యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మనోహరాబాద్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై గురువారం రైతులు బైఠాయించి నిరసన తెలిపారు.యూరియా అందకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు.యాప్‌ల పేరుతో ఎరువులు అందకుండా చేస్తున్నారని రైతులు తీవ్రంగా మండిపడ్డారు. ఎరువుల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని,అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే యూరియా సరఫరా పెంచి రైతులందరికీ అందుబాటులోకి తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.యూరియా సరఫరాలో జాప్యం కొనసాగితే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# మండల కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక

### 21 మందితో కమిటీ ఏర్పాటు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** మండల కాంగ్రెస్‌పార్టీ 21 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్ సమక్షంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నాని, రాజశేఖర్, రవి, హిరాలాల్, ట్రెజరర్ గా రాజేందర్, జనరల్ సెక్రెటరీ గా రమణ, బాబు, సాలె హనుమంతు (కోడుపాక), రవీందర్, బాగయ్య, దుర్గయ్య, సెక్రెటరీలుగా చాకలి నరసింహులు (నార్సింగి), నాగరాజ్, మల్లేశం, పోచయ్య, సుధాకర్, రమేష్ గౌడ్, యాదగిరి, కిరణ్, రాజు, చంద్రశేఖర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ..మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను ఏకతాటి పైకి తీసుకురావడానికి కృషి చేస్తామని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవతీసుకుంటామన్నారు. నూతన కమిటీకి పార్టీనాయకులు,కార్యకర్తలుఅభినందనలు తెలిపారు.

# ఐటీ రంగానికి కృషి చేసిన మహానేత రాజీవ్ గాంధీ

### ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట :** శంకరంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని, రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాన్ని ఆధునికత వైపు నడిపించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. టెలికాం, కంప్యూటర్, ఐటీ రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో భాగస్వాములను చేశారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రజాపక్షం/నిజాంపేట్ : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, నాలుగు రకాల చెత్తలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య సూచించారు. నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో గురువారం సర్పంచ్ ప్రవీణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు నాలుగు రకాల చెత్తలపై అవగాహన కల్పించారు.

ప్రతి ఇంటిలో చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకొని వాటిలో చెత్తను వేసి గ్రామపంచాయతీ సిబ్బందికి అప్పజెప్పాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాజీరెడ్డి, కార్యదర్శి చంద్రహాస్, గ్రామస్తులు ఉన్నారు.

## బాలికను వేధించిన నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలానికి చెందిన బాలికను వేధించిన నిందితుడు దాసరి స్వామి(26)కు మూడేళ్ల జైలుశిక్ష పడింది. అప్పట్లో బాలికను వేధించడంతో పాటు భయభ్రాంతులకు గురిచేయగా బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని సాక్షాధారాలు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య వాదనలు వినిపించారు. దీంతో జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 20వేల జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాసరావు అభినందించారు.

## కళ్లకల్ జాతీయ రహదారిపై రైలు ఇంజిన్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** సాధారణంగా పట్టాలపై పరుగులు తీసే రైలు ఇంజిన్ జాతీయ రహదారిపై దర్శనమివ్వడంతో వాహనదారులు,స్థానికులు ఆసక్తిగా చూశారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామం వద్ద గురువారం ఎన్‌హెచ్44పై భారీ వాహనంలో రైలు ఇంజిన్‌ను తరలించారు.వాహనంపై ఇంజిన్‌ను ప్రత్యేకంగా అమర్చి తరలిస్తుండగా రహదారిపై కొద్దిసేపు ఆసక్తికర దృశ్యం కనిపించింది. పట్టాలపై పరుగులు తీయాల్సిన ఇంజిన్‌ను ట్రక్కుపై తరలిస్తుండటంతో పలువురు వాహనదారులు ఆగి పరిశీలించారు. బెంగళూరులో తయారైన ఈ ఇంజిన్‌ను ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గమ్యస్థానానికి చేరుకునేందుకు సుమారు 15 రోజులు పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వాహనం రాకపోకల నేపథ్యంలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా సిబ్బంది రహదారిపై ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

## జర్నలిస్టుకు ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/రామాయంపేట:** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న జర్నలిస్టు కుస్తి నారాయణను పలువురు కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. రామాయంపేట జర్నలిస్టులు ఇచ్చిన సమాచారంతో ప్రముఖ సంఘ సేవకుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మోహన్‌నాయక్ గురువారం మండల పరిధిలోని దామరచెరువు గ్రామానికి చేరుకొని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేశారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తన అనుచరుల ద్వారా ఐదువేల రూపాయలను జర్నలిస్టు నారాయణకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకుప్రభుత్వానికి వారధులుగా పనిచేసే జర్నలిస్టులు వృత్తి రీత్యా ప్రతీనిత్యం అనేక వ్యయ ప్రయాసల కోర్చి వార్తలు సేకరిస్తారని అన్నారు. ఈసందర్భంగా జర్నలిస్టు నారాయణకు అండగా ఉంటామని ప్రకటించారు. ప్రమాదంలో కాలువిరిగి ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిజి శ్రీనివాస శర్మ, జిల్లా కోశాదికారి ఊడెం దేవరాజు, ఉపాధ్యక్షుడు పాతూరి రమేష్‌గౌడ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బసన్నపల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శి పటేరి రాము, సీనియర్ జర్నలిస్టు చంద్రపు అమరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మద్దూరి భానుచందర్, శివ, లీలా గ్రూప్ సభ్యులు సురేష్‌నాయక్‌తో పాటు పలువురు ఉన్నారు.

## మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో గురువారం మహిళా సమాఖ్య భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఆర్డిఒ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని 25 గ్రూపులకు సంబంధించిన మహిళా సమైక్య సంఘాల మహిళలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పిండి గిర్ని, అల్యూమినియం షాప్ ఏర్పాటు చేసుకోవడానికి కృషి చేస్తుందన్నారు. ఈ రంగంలో రాణించిన మహిళలకు డిపి ఆర్ ఒ షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాను ప్రకాష్ రెడ్డి, ఎపిఎం అశోక్, సిసి వెంకటరాజ్యం, విఒఎ మంగ, గ్రామ మహిళా సమాఖ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గోటి తలంబ్రాల కార్యక్రమం



**ప్రజాపక్షం/గజ్వేల్:** శ్రావణమాసంలో 10 కోట్ల శ్రీరామ నామ లిఖిత మహా సంకల్పం చేపట్టడం ఒక మహోత్తర ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీరామకోటి భక్త సమాజం శ్రీకారం చుట్టడం అభినందనీయమని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అన్నారు. గురువారం భద్రాచలం నుండి వచ్చిన నూతన రామకోటి పుస్తకాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. శ్రావణ మాసంలో 10 కోట్ల శ్రీరామ నామాన్ని లిఖించి భద్రాచల రామయ్యకు సమర్పించాలనే గొప్ప సంకల్పాన్ని ప్రశంసించారు. రామకోటి రామరాజు రామభక్తి, ఆధ్యాత్మిక సేవా తపన ఎంతో గొప్పదని, లోక కళ్యాణార్థం మరిన్ని సేవలు విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు గాడిపల్లి శ్రీనివాస్, రిమ్మనగూడ సర్పంచ్ కర్ణాకర్, వెంకట నర్సింహారావు, పాశికంటి శ్రీనివాస్, గుండు మల్లేశం పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలో గురువారం దివంగత నేత, భారత రత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని మండల కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ కుటుంబం చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కొమ్మట బాబు, సీనియర్ నాయకులు నసిరుద్దీన్, వెంకటేశం, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సూర రాములు, ఉప సర్పంచులు అంజిరెడ్డి, రాములు, గరుగుల శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి సాగుపై రైతులకు శిక్షణ

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** అల్లాదుర్గం మండలం చేవెళ్ల రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ముందస్తు అనుభవ గుర్తింపు శిక్షణ ,అధిక సాంద్రతలో పత్తి సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ, విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, నేల పరీక్ష, సమతుల్య ఎరువుల వాడకం, సమగ్ర చీడపీడల యాజమాన్యం, పురుగు మందుల సురక్షిత వినియోగం, వ్యక్తిగత రక్షణ పరికరాల వాడకం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రాముఖ్యత, మార్కెటింగ్ అంశాలపై శిక్షణ కల్పించామన్నారు. సన్నరకం వరి రకాలు, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు, ఎరువుల సమాచార, రైతు క్షేత్ర పాఠశాల అనువర్తనాల వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు లక్ష్మి, నవీన్, విఠల్ రావు, నవనీత రైతులు పాల్గొన్నారు

## పిడిఎస్‌యు పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలి

### అరుణోదయ విమలక్క




**ప్రజాపక్షం/సిద్దిపేట:** పిడిఎస్‌యు పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలని అరుణోదయ విమలక్క అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పిడిఎస్‌యు పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ..నాటి ఉద్యమ అనుభవాలను నేటి తరానికి అందిస్తూ సమాజంలో నెలకొన్న అసమానతలను విద్యార్థుల సమస్యలపై మరోసారి గొంతెత్తాల్సిన అవసరం ఉందని అన్నారు.తాను పిడిఎస్‌యు పూర్వ విద్యార్థినని అరుణోదయం కంటే ముందు నుండే విద్యార్థి ఉద్యమాల్లో భాగస్వామిగా ఉన్నానని గుర్తు చేసుకున్నారు.పిడిఎస్‌యు పూర్వ విద్యార్థుల కలయిక గొప్ప మార్పునకు సంకేతమని నాటి ఉద్యమాలు,పోరాటాలు,అనుభవాలను గుర్తు చేసుకుంటూ మనమంతా మళ్లీ ఒక చోటుకి చేరడం సంతోషంగా ఉందని అన్నారు. సమాజంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని వాటిపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొండా నాగేశ్వర్ రావు, శ్రీహరి, అఖిల్, వంగల సంతోస్, పూర్వ విద్యార్థులు బొందుగుల నాగరాజు, తిరుపతి, విష్ణు, ముత్యాల నర్సింహులు, బోనాల సాయి, కరికే సత్యనారాయణ, సర్ధార్, మహేందర్, రాకేష్, శ్రీను, సాయి, రవి, భూపతి గౌడ్, ఎల్లం పాల్గొన్నారు.

## రహదారి విస్తరణ పనుల పరిశీలన

**ప్రజాపక్షం /హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో రామవరం వెళ్లు రోడ్డు విస్తరణ పనులను ఆభివృద్ధి పేరిట రోడ్డ పక్కన ఉన్న నివాసాలను మున్సిపల్ ఆధికారులు కూల్చివేస్తున్నారని ఇది కేవలం పేదల జీవితాలను కాలరాయడం మాత్రమే ఆవుతుందని ఎల్కుతుర్తి నుండి సిద్దిపేట వెళ్లు రోడ్డును 100 ఫీట్లు నిబంధనలు ఉండగా కేవలం 90 ఫీట్లు మాత్రమే ఉందని మరి రామవరం రోడ్డు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లు రోడ్డును 70 ఫీట్లు ఎందుకు ఆని బిఆర్ ఎస్ పార్టీ నాయకులు ఐలేని మల్లికార్జున్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు వెలుస్తున్న నూతన వెంచర్లను నియంత్రించకుండా ఆవినీతికి పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కమిషనర్ మల్లికార్జున్‌ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాలకవర్గంతో అంటకాస్తు అవినీతికి ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని మల్లెచెట్టు నుండి ఎల్లమ్మ చెరువు వరకు చేపడుతున్న 70 ఫీట్ల రోడ్డుకు బదులు 60 ఫీట్లు తీసుకోవాలని అక్కడి ఇంటి యజమానులు కోరినప్పటికీ కేవలం ఎల్లమ్మ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గ్లాసు బ్రిడ్జికోసం ఇంత మంది నివాసాలను కూల్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పట్టణంలో జరుగుతున్న అవినీతిపై తొందరలోనే ప్రజల ముందు ప్రశ్నిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, మాటూరి రాజశేఖర్, బత్తుల కొమురయ్య, బొడ ఎల్లరెడ్డిలు పాల్గొన్నారు.

## సిద్దిపేట పోలీస్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ కుశాల్కర్ ఎన్నికల అధికారిగా, గజ్వేల్ ఏసీపీ నరసింహులు నోడల్ అధికారిగా వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు సీఐ కిరణ్, చేర్యాల సీఐ రమేశ్, సీఐ వాసుదేవరావు, రిజర్వ్ సీఐ తిరుపతి పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. బేగంపేట పోలీస్ సేష్టన్‌కు చెందిన కానిస్టేబుల్ చిందం సుభాష్ అద్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మల్లేష్( పీసీఆర్ సీఐ) అభిలాష్ (కోహేడ ఎస్ఐ) ప్రధాన కార్యదర్శిగా సాయి చరణ్(ఆర్ ఎస్ఐ),సంయుక్త కార్యదర్శిగా రవి కుమార్( సివిల్ కానిస్టేబుల్), కార్యనిర్వహణ కార్యదర్శిగా గంపల సతీశ్( చేర్యాల కానిస్టేబుల్), కోశాధికారిగా తిరుపతి( కోహెడ కానిస్టేబుల్) ఎన్నికాయ్యరు. కార్యవర్గ సభులుగా బి. రాజు, డి. శ్రీనివాస్,యాదగిరి, తార, పి. శాంభవి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పోలీసు అధికారుల సంఘం కార్యవర్గసభ్యులకు సీపీ రష్మితో పాటు ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

## గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్

### పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి

**ప్రజాపక్షం/గజ్వేల్:** ప్రపంచ దేశాల్లో భారత్ ను తలెత్తుకునేలా చేసిన దివంగత ప్రధాని రాజీవ్ సేవలు చిరస్మరణీయం కాగా, దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరా గాంధీల చరిత్రను ఎవరూ కనుమరుగు చేయలేరని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ లో నిర్వహించిన రాజీవ్ జయంతి వేడుకల్లో పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మైనార్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు సమీర్, వైశ్య సంఘం నేత నంగునూరి సత్యనారాయణ గుప్తతో కలిసి వారు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి నేరుగా రోజ్ గార్ నిధులు, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 32 శాతం రిజర్వేషన్, 21 ఏళ్లకే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. ఆయన అందించిన కృషి, సేవల ఫలితంగానే నేడు దేశం అగ్రరాజ్యాలకు దీటుగా రూపుదిద్దుకోగా, దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబాన్ని కించపరుస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా కుట్రలు పన్నుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు నక్కరేగొండ గౌడ్, రాములు గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, అజార్ పాల్గొన్నారు.

## నీటి లభ్యత ఆధారంగా పంటల సాగు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ఎల్ నినో ప్రభావం మూలంగా ఈసారి వర్షాలు లేనందున నీటి లభ్యత ఆధారంగా పంటలు సాగు చేయాలని మండల ప్రత్యేక అధికారి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జగదేవ్‌పూర్ రైతు వేదికలో వర్షాభావ పరిస్థితులు పంటలసాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తక్కువ నీటితో సాగు చేసే పంటల సాగుపై రైతులు దృష్టిసారించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోని ఆర్థికంగా బలపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వేణుగోపాల్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి వసంతరావు, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, మీషన్ భగీరథ, మైనర్ ఇరిగేషన్ ఎఈలు శ్రీనివాస శర్మ, సిద్ధార్థ్,ఆయా శాఖల అధికారులు శ్వేత,సుధాకర్, సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండల పరిధిలోని మర్పడగా, రాంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మర్పడగా అధ్యక్షుడిగా మెరుగు రాజు, రాంపల్లి అధ్యక్షుడిగా చిట్యాల స్వామి ఎన్నికయ్యారు. ఆయా గ్రామాల ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సలహాదారులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల కనకరాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కనకరాములు, సర్పంచ్ కొయ్యడ వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు, శశిధర్ రెడ్డి, ఆరెపల్లి శ్రీనివాస్, సిద్ధులు, మంచాల చిన్న శ్రీనివాస్, మల్లికార్జున్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో దరఖాస్తు : ఫలితం శూన్యం

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భట్టి కుంట కట్టు కాలువపై మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు దరఖాస్తు చేశారు. కానీ ఇరిగేషన్ అధికారులు తమకేమీ పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం వర్షాలు పడితే కోమటికుంట నుండి ఆవకుంటకు ఆవకుంట నుండి బట్టి కుంటకు బట్టి కుంట నుండి పటేల్ చెరువులకు నీళ్లు పోవాల్సి ఉంది ఈ గొలుసుకట్టు చెరువుల కట్టు కాలువలు పూర్తిగా ముళ్లపొదలు మట్టితో నిండి నీళ్లు పోకుండా అడ్డు తలుగుతున్నాయని గత సంవత్సరం ఎక్కువ వర్షాలు పడి కట్టుకాలువలు పూర్తిగా ముళ్లపొదలు మట్టితో నిండిపోయి ఆవకుంట కట్టపై నుండి నీరు ప్రవహించి సగం కట్ట కొట్టుకుపోయిందని అదే సమయంలో బట్టుకుంట కట్ట తెగిపోయిందని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టి కట్టు కాలువ మరమ్మత్తులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరారు.

## తక్కువ నీటితో పండించే పంటలు వేసుకోవాలి

### వ్యవసాయ అధికారి శివరామకృష్ణ

**ప్రజాపక్షం/కొండపాక :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్‌లో ఏర్పడే నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు గురువారం దుద్దెడ రైతు వేదికలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మి అధ్యక్షత వహించగా, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ వీరూపాక శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వర్షపు నీటిని పొలంలోనే నిల్వ చేసుకునేందుకు ఫామ్ పాండ్‌ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు హార్టికల్చర్ అధికారి కౌసల్య విద్యుత్ ఏ ఈ సత్యం, వివిధ శాఖల అధికారులు ఏఈఓ లు పాల్గొన్నారు.

## శక్తి హఠావో.. పాలిటెక్నిక్ బచావో

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ జానికి దేవి ఆద్వర్యంలో 15 మంది కాలేజ్ స్టాఫ్ నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 2.20 గంటలకు వరకు నిరసన తెలిపారు. వీరు శక్తి హఠావో..పాలిటెక్నిక్ బచావో అని ప్లకార్డులు పట్టుకొని జీఓ నెంబర్ ను రద్దు చేయాలని నిరసన కార్యక్రమం చేశారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను శక్తి కింద విలీనం చేయకూడదు. పేద , దిగువ మధ్యతరగతి విద్యార్థుల ఇంజనీరింగ్ కళలను కాపాడడానికి పాలిటెక్నిక్ శక్తి విలీనం చేసే ప్రతిపాదనను తెలంగాణ కేబినెట్ వెంటనే విరమించుకోవాలి, ప్రభుత్వ శక్తిని ఒక ప్రత్యేక ఉపాధి ఆధారిత నైపుణ్య కేంద్రంగా స్వతంత్రంగా నిర్వహించాలన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/హత్నూర** : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని దేశ ఆధునీకరణకు యువత సాధికారతకు ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన స్ఫూర్తి తో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంలో రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అర్హత కలిగిన ప్రతి యువతి, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహిస్తూ కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం 6 దరఖాస్తులను నింపించారు. ప్రజా స్వామ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే యువత పెద్ద ఎత్తున ఓటరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ,మాజీ సర్పంచ్ వెంకటేశం, కాసాల సర్పంచ్ వెంకటేష్, నాయకులు, హకీమ్, అజీజ్, నర్సాపూర్, మున్సిపాలిటీ చైర్మన్ లక్ష్మి రాజు , మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం; హత్నూర మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు; కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై ఆందోళన చెందొద్దు

మండల వ్యవసాయ అధికారి స్రవంతి



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలో యూరియా కొరతపై రైతులు జాతీయ రహదారిపై చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి స్పందించి మండల వ్యవసాయ అధికారి స్రవంతి రైతులతో మాట్లాడుతూ యూరియా కోత పై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. యూ రియా సరఫరాలో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగానే తాత్కాలికంగా ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. మండ లంలోని సహకార సంఘాలు, ఎరువుల వి క్రయ కేం ద్రాల్లో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొంది. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు సకాలంలో అందించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని అన్నారు. రైతులు ఆందోళనకు గురికాకుండా అందుబాటులో ఉన్న కేంద్రాల ద్వారా యూరియా పొందాలని వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వి నోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్



**ప్రజాపక్షం/సంగారెడ్డి** : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలనే డిమాండ్‌తో చేపట్టిన పాలిటెక్నిక్ విద్యాసంస్థల బంద్ కార్యక్రమం అమీన్పూర్ మండలంలో విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ హాజరై విద్యార్థుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ పేద , మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను బలహీనపరిచే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శక్తి స్కీమ్‌ను రద్దు చేయాలని జీఓఎంఎస్ 97 ను రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను పిపిపి ,ప్రైవేటీకరణ వైపు నడిపించే చర్యలను నిలిపివేయాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యాసంస్థలకు అవసరమైన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థులు అధ్యాపక సంఘాలతో చర్చించకుండ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శాంసన్ ,నాయకులు విశాల్ సాయి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్‌ల హక్కుల కోసం ఉద్యమిస్తాం

రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కార్తీక్



**ప్రజాపక్షం/రామాయంపేట:** ఉప సర్పంచుల హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు కార్తీక్ అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తుండగా రామాయంపేట, నిజాంపేట మండలాల ఉప సర్పంచులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచ్‌లు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది వక్రబుద్ధి గల సర్పంచ్‌లు ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ తొలగించాలని చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. గ్రామ పంచాయతీల్లో చేసే అభివృద్ధి పనుల్లో ఏర్పాటు చేసే శిలాఫలాకాలపై ఉప సర్పంచుల పేర్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు రమేష్‌గౌడ్, రామాయంపేట మండల అధ్యక్షులు బాబునాయక్, నింగరమైన రమేష్, పిట్ల నరేష్, ఆకుల మహేష్, రాములు, నజాం, బాబు, అంజిరెడ్డి, రామచంద్రారెడ్డి, రతన్‌సింగ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

# పిసి,పిఎన్‌డిటి చట్టంపై జిల్లా స్థాయి సమావేశం



**ప్రజాపక్షం/సంగారెడ్డి** : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను అరికట్టడం, పిసి, పిఎన్‌డిటి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె లలిత దేవి అధ్యక్షతను జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో స్కానింగ్ కేంద్రాల పనితీరు. చట్టం అమలు రికార్డుల నిర్వహణ గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు ,లింగ నిర్ధారణ నిషేధానికి సంబంధించిన నిబంధనలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. పిసి , పిఎన్‌డిటి చట్టాన్ని ప్రతి స్కానింగ్ కేంద్రం తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా చట్టంపై అవగాహన పెంపొందించుకుని ఎక్కడైనా లింగ నిర్ధారణ కు సంబంధించిన అక్రమ కార్యకలాపాలు, జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. మహిళా శిశు, సంరక్షణ, బాలికల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాగనిర్మల ,డాక్టర్ ప్రవీణ్, డిఎంహెచ్ఓ వనజరెడ్డి, డా.రాజుగౌడ్, డాక్టర్ శైలజా ,డాక్టర్ సుదారాణి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/సంగారెడ్డి** : మాజీ ప్రధాన మంత్రి భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని ఐబి చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహానికి డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను ఆమె స్మరించుకున్నారు. దేశాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ కీలక పాత్ర పోషించారని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ సమాచార సాంకేతికరంగం అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. దేశంలో టెలికాం ,కంప్యూటర్ రంగాల విస్తరణకు రాజీవ్ గాంధీ తీసుకున్న చర్యలు భవిష్యత్ భారత నిర్మాణానికి బాటలు వేశాయని తెలిపారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారని ఆమె గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధి ప్రజా సంక్షేమం యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ ,మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హబీజ్, సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ నాయకులు కూన సంతోష్ కౌన్సిలర్లు గడ్డం రాజు రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల 12న జాతీయ అదాలత్

**ప్రజాపక్షం/సంగారెడ్డి** : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ,రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు గురువారం మూడవ జిల్లా అదనపు న్యాయమూర్తి మాధురి కృష్ణ బ్యాంక్ చిట్ ఫండ్ ఇన్సూరెన్స్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 12 వ తేదీన నిర్వహించనున్న జాతీయ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు బ్యాంకులు ,చిట్‌ఫండ్ సంస్థలు ఇన్సూరెన్స్ సంస్థల అధికారులతో పాటు స్టాండింగ్ అడ్వకేట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించదగిన కేసులను గుర్తించడం పెండింగ్‌లో ఉన్న వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం సంబంధిత పక్షాలకు ముందస్తుగా సమాచారం అందించడం వంటి అంశాలపై చర్చించారు. బ్యాంకులు,చిట్ ఫండ్ ఇన్సూరెన్స్ సంస్థలు , స్టాండింగ్ అడ్వకేట్లు తమ పరిధిలోని కేసులను పరిశీలించి ఎక్కువ సంఖ్యలో కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరమయ్యేలా సహకరించాలని సూచించారు.ప్రజలు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న తమ కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి మాదవి కృష్ణ ,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య లీడ్ బ్యాంక్ మేనేజర్ సుదీర్ బ్యాంక్ అధికారులు చిట్‌ఫండ్ అధికారులు ఇన్సూరెన్స్ అధికారులు స్టాడింగ్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ

పార్టీ ఇంచార్జీ నీలం మధు ముదిరాజ్

**ప్రజాపక్షం/పటాన్‌చెరు** : ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు టెలికాం రంగంలో సరికొత్త సంస్కరణలు తెచ్చి భారత దేశాన్ని టెక్నాలజీలో పరుగులు, పెట్టించిన మహా ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దక్కుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నీలం మదు ముదిరాజ్ అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని చిట్కుల్ లోని ఎన్ ఎం ఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ విప్లవానికి రాజీవ్ గాంధీ అన్ని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి పెద్ద పీట వేస్తూ పలు సంస్కరణలు తీసుకొని వచ్చి సాంకేతిక విప్లవాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని కొనియాడారు. ఆ మహనుభావుని ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణను ప్రపంచంలో అభివృద్ధిలో మేటిగా నిలిపేందుకు కృషి చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సంగన్న గారి గోపాల్ దస్తగిరి, మన్నె రాఘవేంద్ర ,నారాయణదాసు సంపత్, నాయకులు అశోక్, శ్రీనివాస్ ,వీరేష్, అనిల్, రాజ్‌కుమార్ కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/కొమురవెల్లి** : వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం కొమురవెల్లి రైతువేదికలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలతో పాటు వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. నేల స్వభావం, నీటి లభ్యత పరిగణనలోకి తీసుకుని ఆయిల్‌పామ్, కందులు, మినుములు, సజ్జ, రాగి, ఆముదంతదితర పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఓ వెంకటరామమ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ సయ్యద్ రఫీక్, ఏపీఓ శ్రీ బాలలింగం, ఏఈఓ రవళి, కొమురవెల్లి గ్రామ సర్పంచ్ గొల్లపల్లి పద్మాంజనేయులు, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బొప్పు ఎల్లయ్య యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ చింతల పరశురాములు, సోషల్ మీడియా ప్రతినిధి చింతల రమేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండల కేంద్రం లోని వైఎస్ఆర్ సెంటర్‌లో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ, దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు కంప్యూటర్ టెలికమ్యూనికేషన్ డిజిటలైజేషన్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలకు ప్రాధాన్యత కల్పించి భారతదేశ అభివృద్ధికి బలమైన పునాది వేశారని పేర్కొన్నారు.



బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతితో పాటు విద్య, సాంకేతిక అక్షరాస్యత, యువతకు అవకాశాల కల్పనపై రాజీవ్ గాంధీ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. దేశంలోని యువతకు ప్రజాస్వామ్య ప్రక్రియలో మరింత భాగస్వామ్యం కల్పించేందుకు ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీ దేనని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ ఆశయాలు,దేశ అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ దేశాభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింత పున్నారావు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, పూజారి సురేందర్, మురుకుట్ల నరేందర్, కొమరం బాలన్న, బాడిషా ఆదినారాయణ, చాద మల్లయ్య, బసారికారి హరికృష్ణ, ఇదయతుల్లా ఎడ్ల నరేష్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి మూగల చంటి మాసిరెడ్డి, వెంకటరెడ్డి, నరసయ్య, చిన్నపెల్లి రాంబాబు, కాటబోయిన నరసింహారావు, గద్దల సాయి, బిల్పాటి నరేష్, కస్ప ముకుందం, మద్దెల ప్రవీణ్, దుర్గం బిక్షపతి, బూర్గుల సతీష్, బండపల్లి యాకయ్య పాల్గొన్నారు.

## కుసుమ జగదీశ్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/మల్లంపల్లి:** ములుగు జిల్లా తొలి జెడ్పీ చైర్మెన్, బిఆర్ఎస్ నేత కుసుమ జగదీశ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆయన ఇండి వద్ద స్వర్గీయ జేడీ చిత్రపటానికి కుటుంబ సభ్యులతో కలిసి బిఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8,9 తరగతులు చదువుతున్న 80 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈసందర్భంగా ములుగు అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడాని పాటు పడతామని స్పష్టం చేశారు. చిన్న వయసు లోనె జగదీశ్ వంటి నాయకుడ్ని కోల్పోవడం బిఆర్ఎస్‌కు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో కుసుమ జగదీశ్ తండ్రి, మాజీ సర్పంచ్ కుసుమ ఆదినారాయణ, ములుగు బిఆర్ఎస్ నాయకులు భూక్య జంపన్న, బత్తోజు ద్రోణాచారి, తదితరులు పాల్గొన్నారు.

## పప్పుదినుసుల సాగుతో రైతులకు అదనపు ఆదాయం



**ప్రజాపక్షం/గూడూరు;** ఆత్మ నిర్భరత పప్పుదినుసుల మిషన్‌లో భాగంగా గూడూరు మండలంలోని వ్యవసాయ శాఖ అధికారులు పెసర పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మండలంలోని మరిమిట్ట గ్రామపంచాయతీ పరిధిలో తోట దసురు తండా లో పంటల పపిస్థితిని పరిశీలించి రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు గూడూరు వ్యవసాయ శాఖ అదికారి అబ్దుల్ మాలిక్ అవగాహన కల్పించారు.ప్రస్తుత వాతావరణ పరిస్తితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం ఉన్న పప్పుదినుసుల పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. ముఖ్యంగా పెసర కంది మినుము అలనంద వంటి పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు నేల సారాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు.పంటల వైవిధ్యాన్ని పాటించడం ద్వారా ఇతర పంటలపై ఆధారపడటాన్ని తగ్గించి రైతులకు అదనపు ఆదాయం పోందే అవకాశం ఉంటుందని పేర్కోన్నారు.పప్పుదినుసుల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతులో సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. ఈకార్యక్రమంలో తోటదస్రుతండా రైతులతో పాటు ఏఈఓలు మనోజ్ సుస్మీత చందన వినయ్ మధు పాల్గోన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ప్రభుత్వమే పునఃప్రతిష్ఠించాలి

**ప్రజాపక్షం/తాడ్వాయి :** తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత హీనమైన చర్య అని, వెంటనే ఆ విగ్రహాన్ని ప్రభుత్వ ఖర్చులతో మెడికల్ కాలేజీ ఎదుట పునఃప్రతిష్ఠించాలని ములుగు జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరికా గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. తాడ్వాయి మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు నూషెట్టి రమేశ్, స్థానిక సర్పంచ్ ప్రవలిక గున్ను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ప్రారంభం నుంచే చురుగ్గా పాల్గొని, గత 26 సంవత్సరాలుగా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న గొప్ప ప్రజా నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని గత పది రోజుల్లో రెండుసార్లు ధ్వంసం చేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రాలకే పరిమితమైన మెడికల్ కాలేజీని, అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి నర్సంపేటకు



సాధించిన ఘనత పెద్ది సుదర్శన్ రెడ్డికే దక్కుతుందని గుర్తు చేశారు. ఆయన చేసిన ప్రజాసేవలను గుర్తించి, నర్సంపేట మెడికల్ కాలేజీ ముందు ప్రభుత్వ ఆధీనంలో గౌరవప్రదంగా విగ్రహాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పోగు నాగేష్, ఉద్యమకారుల సంఘం మండల కార్యదర్శి ఆలేటి ఇంద్రసేనారెడ్డి, పత్తి గోపాల్ రెడ్డి, బంగారి శ్రీరాములు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య, బంగారు సాంబయ్య, గంట మనోజ్ రెడ్డి, మనుగొండ నవీన్, టాగూర్ సురేందర్, ఎల్లబోయిన రాకేశ్, మంతేన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి కాంగ్రెస్ నేతల పరామర్శ

**ప్రజాపక్షం/ములుగు:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్ష్మీదేవిపేటకు చెందిన ఆర్ఎంపి వైద్యుడు, కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మంత్రి సీతక్క ఆదేశాలు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు లక్ష్మీదేవిపేట సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ రూ.5వేలు, ఉప సర్పంచ్ కొండా తిరుపతి రూ.2వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవీందర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. మంత్రి సీతక్క దృష్టికి విషయం తీసుకెళ్ళి అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ



కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కట్టెకొల్ల వెంకటేష్, వార్డు సభ్యురాలు మద్దెల సువర్ణ రమేష్, సీనియర్ నాయకులు గజవేణి రమేష్, గోస్కుల తిరుపతి, యూత్ కాంగ్రెస్ నాయకుడు కన్నం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## జిఓ నెం.97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** విద్యార్థులంటే తీవ్రవాదులా? విద్యార్థుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ ప్రజాస్వామ్య రీతిలో నిరసన తెలిపే హక్కు వారికి లేదా? విద్యార్థులంటే పోలీసులకు ఇంత కోపమా? అని అనుకుంటే ఇవన్నీ నిజమేనన్నట్లుగా ప్రవర్తించారు మహబూబాబాద్ పోలీసులు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని, ఈ దేశాన్ని తీర్చిదిద్దేది విద్యార్థులేనని, ఉన్నత చదువులు చదువుకుని వేదికలపై ప్రగల్భాలు పలికే సమాజంలో ఈ దేశానికి సేవలు అందించాలనే విద్యార్థుల గొంతు నొక్కింది పోలీసు వ్యవస్థ. వివరాల్లోకి వెళితే పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను ఐటిఐ స్థాయికి దిగదార్చేలా తీసుకువచ్చిన జిఓ నెం.97రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేసముద్రం పాలిటెక్నిక్ విద్యార్థులు బుధవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థులు కలెక్టరేట్ గేటు లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు విద్యార్థులకు ఈడ్చుకుంటూ రోడ్డుపైకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో విద్యార్థినీ విద్యార్థులు వారి డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేస్తుండడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సిఐ రఘుపతిరెడ్డి విద్యార్థుల గొంతు పట్టుకుని కిరాతకంగా ప్రవర్తించడంతో పోలీసులకు వ్యతిరేకంగా విద్యార్థిసంఘాలు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ప్రతినిథులు నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్లెక్కిన పాలిటెక్నిక్ విద్యార్థులపై సిఐ రఘుపతిరెడ్డి ప్రవర్తించిన తీరును వ్యతిరేకిస్తూ సిఐపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వారు తీవ్రవాదులు కాదని విద్యార్థులని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై సహనం లేకుండా సిఐ రఘుపతిరెడ్డి విద్యార్థులు చొక్కాలు పట్టుకుని, కసిగా గొంతు పట్టుకుని తోసివేయడం సబబు కాదని, తాను కూడా ఒకప్పుడు విద్యార్థేనని గుర్తుంచుకోవాలని, విద్యార్థులపై దారుణంగా ప్రవర్తించిన సిఐపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు ఉన్నతాధికారులను విద్యార్థిసంఘాలు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులు జిఓ నెం.97ను ప్రభుత్వం రద్దు చేయకుంటే విద్యార్థి ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

## సోమవారం నుంచి నూతన కలెక్టర్ కార్యలయంలో ప్రజావాణి

**ప్రజాపక్షం/ములుగు టౌన్:** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఆగస్టు 24వ తేదీ నుండి నూతనంగా ప్రారంభించిన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎడమవైపు ఉన్న సమావేశ మందిరం లో నిర్వహించడం జరుగుతుందని ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట లభించేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. ప్రజలు తమ వినతులు, దరఖాస్తులను ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అందజేయాలని తెలిపారు.

## ఆరుతడి పంటలు సాగు చేయాలి

**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగురు) :** మండలంలోని పాత్రాపురం రైతు వేదికలో పంటల వైవిధ్యీకరణ ఆరుతడి పంటల సాగు అనే అంశం మీద మండల వ్యవసాయ ఆధికారి అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ ఆధికారి నవీన్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు సాంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న బదులుగా పెసర, మినుము, అలసందలు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలు వేయాల్సింది గా సూచించారు.సాంప్రదాయ పంటలతో పోలిస్తే తక్కువ నీటితో పండించవచ్చని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఏడు వరి రకాలు సాగు చేసే రైతులు ఎవరైనా ఉంటే బోనస్ కోసం డీలర్ల దగ్గర తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేకపోతే రూ. 500 బోనస్ పొందలేరని మరొకసారి గుర్తు చేశారు. ఈసమావేశం లో AEO, మండల రైతులు పాల్గొన్నారు.

## సేవే లక్ష్యం- ప్రజాసేవే నా మార్గం

**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలం చేరుపెల్లి (కొత్తపేట) గ్రామానికి చెందిన బేతా వెంకటేష్ ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందాగా స్థానిక గ్రామస్తులచే విషయం తెలుసుకున్న శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యువ నాయకులు బాడిష నాగ రమేష్ గురువారం చేరుపెల్లి (కొత్తపేట) గ్రామం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యాన్ని అందించి తన వంతు సహాయంగా దశదిన కర్మలకు ఐదు వేల రూపాయలు బేత వెంకటేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. మృతుని కుటుంబ సభ్యులని ఓదార్చి మీరేమీ అధర్య పడకండి బిఆర్ఎస్ పార్టీ మీకు ఎప్పుడు అండగా ఉంటుంది అని బేత వెంకటేష్, కుటుంబ సభ్యులకు భరోసా అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తమల్లూరు మాజీ అధ్యక్షులు మునిగేల సాంబులు మల్లూరు మాజీ అధ్యక్షులు సోయం ఈశ్వర్, నిమ్మగూడెం మాజీ అధ్యక్షులు కొమరం పుల్లారావు, అక్కినపల్లి మాజీ అధ్యక్షులు రూప బాధ్రయ్య, సుకుమార్, జోసెఫ్ తంబీ, కర్రీ శ్రీను, సుధీర్, వీరాస్వామి, పవన్, భాస్కర్, సంతోష్, మహేష్, రమేష్, బన్ను మహేష్, సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



**ప్రజాపక్షం, తొర్రూరు :** కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు అన్నారు. ఈ నెల 22,23 తేదీల్లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాల్గొవ మహాసభల కరపత్రాలను గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలకుంట్ల సాయిలు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగుల లేబర్ కోడ్‌లుగా మార్చి హక్కు లేకుండా చేసి యాజమాన్యాలకు తొత్తులుగా చట్టాలను మార్పు చేసిందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలైన సింగరేణి, ఎన్టీపీసీ, రైల్వే జెన్‌కో, బ్యాంకింగ్, విమానయానం, రక్షణ విభాగం తదితర సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఐఎఫ్టీయూ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నబోయిన శ్రీను, రామకోటి యాదయ్య, యాకయ్య, కొండారావు, బిక్షపతి, రమేశ్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.